సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



దుకాణాలు ధ‘మాల్’
మార్కెట్‌లో విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న మాల్స్‌తో పోటీ పడలేక పలువురు వ్యాపారులు దుకాణాలు మూసేస్తున్నారు. 8లో



గుండెకు గండం
ఖమ్మం పెద్దాస్పత్రిలో వారం రోజులుగా గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. 8లో



వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురుస్తుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీ బాలాజీ కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి ఎడవల్లి దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్ : కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ శనివారం గాంధీభవన్‌లో రూ.50 డీడీ చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు టికెట్ కేటాయిస్తే గెలుపు తథ్యమని అన్నారు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నానని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న తనకే అధిష్ఠానం టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎడవల్లి వెంట నాయకులు రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, షఫీ తదితరులు ఉన్నారు.

కేంద్ర బృందం సర్వే



రుద్రంపూర్‌లో సర్వే చేస్తున్న సభ్యులు

చుంచుపల్లి: మండల పరిధిలోని రుద్రంపూర్ ఏరియాలో శనివారం లెప్రసీపై డాక్టర్ రాజేంద్రకుమార్ సింగ్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అనుమానితులను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెప్రసీ నివారణే లక్ష్యంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని తెలిపారు. లెప్రసీ నిర్మూలనకు వైద్యశాఖ చేపడుతున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో పెనగడప వైద్య సిబ్బంది భద్రు, వెంకటేశ్వర్లు, పూర్ణారావు, మనీల పాల్గొన్నారు.

రాంపేడులో తనిఖీ

ఇల్లెందురూరల్: మండలంలోని రాంపేడులో కేంద్రం బృందం శనివారం పర్యటించింది. ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను సభ్యులు పరిశీలించారు. కమ్యూనిటీ సోప్‌పిట్స్, సెగ్రిగేషన్‌షెడ్లు, వీధుల్లో పారిశుద్ధ్య చర్యలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ టీం సభ్యుడు సింగం పరశురాం, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి హెచ్‌ఎంలకు శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో అభ్యసన అభివృద్ధికి చేపట్టిన ఉన్నతి కార్యక్రమ నిర్వహణపై జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు కొత్తగూడెం తెలంగాణ స్కూల్లో శిక్షణ ఇస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ప్రభుత్వ, లోకల్ బాడీ, కేజీబీవీ హైస్కూళ్ల హెచ్‌ఎంలంతా హాజరు కావాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాకు చెందిన నలుగురు ప్రధానోపాధ్యాయులు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి శిక్షణ పొందారని తెలిపారు. విద్యార్థుల్లో అభ్యసన అభివృద్ధితో పాటు, ఎలాంటి ఆటంకాలు లేకుండా సిలబస్ పూర్తి చేయడం ఎలా అనే అంశాలపై శిక్షణ ఇస్తారని వివరించారు. అంతేగాక పదో తరగతి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక లక్ష్య కార్యక్రమ అమలుపైనా అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. శిక్షణకు సమన్వయకర్తగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ వ్యవహరిస్తారని తెలిపారు.

క్రిటికల్ సమస్యే !

- సర్వజన ఆస్పత్రిలో అత్యవసర సేవలకు స్థలమేది ?
- మెడికల్ కాలేజీతో మెరుగైన వైద్య సేవలు
- కొత్తగా 50 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు
- సీసీయూ నిర్మాణానికి జాగా లేదు..
- ఆస్పత్రి విస్తరణకు కొరవడిన ప్రణాళిక



కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని మెడికల్ కళాశాలకు భవిష్యత్ ప్రణాళిక కరువైందా అంటే అవుననే చెప్పాలి. కాలేజీకి అనుమతులు సాధించడం, మొదటి బ్యాచ్ అడ్మిషన్లలో ఉన్న శ్రద్ధ ఆ తర్వాత కనిపించడం లేదు. దీంతో ఈ కళాశాలకు అనుబంధంగా వచ్చే ఇతర సౌకర్యాల కల్పనకు కష్టంగా మారింది.

ఉరుకులు.. పరుగులు..

జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీని మంజూరు చేయడంతో దానికి అనుబంధంగా 330 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. కాలేజీ మంజూరయ్యే నాటికి కొత్తగూడెంలో 100 పడకల ఏరియా ఆస్పత్రి, 100 పడకల మాతా శిశు ఆస్పత్రి.. మొత్తంగా 200 పడకలే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆగమేఘాల మీద ఏరియా ఆస్పత్రిలో మరో ఫ్లోర్ నిర్మించి పడకల సంఖ్యను 230కి పెంచారు. మాతాశిశు ఆస్పత్రితో కలిపి 330 పడకలుగా చూపించారు. అప్పటికే కొత్తగూడేనికి మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కళాశాల కూడా మంజూరైంది. నర్సింగ్, మెడికల్ కాలేజీల భవనాలు, ల్యాబ్‌లు, హాస్టళ్ల నిర్మాణం కోసం కేఎస్ఎం కాలేజీలో స్థలం కేటాయించారు. ముందుగా నర్సింగ్ కాలేజీ భవనాలు నిర్మించారు. 2022 – 23 ఏడాదికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభంకావడంతో నర్సింగ్ కాలేజీ భవనాలనే మరింతగా ఆధునీకరించి వైద్య విద్య మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. ఇక ఆ తర్వాత మెడికల్ కాలేజీపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు శ్రద్ధ చూపించడం తగ్గించారు.

50 పడకలతో సీసీయూ..

ఇటీవల కొత్తగూడెం బోధనాస్పత్రికి 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ) మంజూరైంది. అయితే దీని నిర్మాణానికి కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో చోటు లేదు. నిబంధనల ప్రకారం సీసీయూ నిర్మాణానికి విశాలమైన ప్రాంగణం అవసరం. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న పేషెంట్లను ఆస్పత్రికి తీసుకురానున్నందున అంబులెన్స్ సులువుగా ఆస్పత్రిలోకి వచ్చి పోయేందుకు వీలుండాలి. దీని కోసం పొడవు, అడ్డంలో 55 మీటర్ల వెడల్పుతో కూడిన స్థలంలో సీసీయూ భవనాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సర్వజన ఆస్పత్రి 3.5 ఎకరాల ప్రాంగణంలో విస్తరించి ఉంది. ఇందులోనే 230 పడకలు, ఓపీ, డయాగ్నోస్టిక్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్, క్యాంటీన్, మార్చురీ ఉన్నాయి. సిబ్బంది క్వార్టర్లు కూడా ఇక్కడే నిర్మించారు. దీంతో సీసీయూ నిర్మాణానికి ఆస్పత్రి ప్రాంగణంలో స్థలం సరిపోయే పరిస్థితి లేదు.

క్వార్టర్లు తొలగిస్తే..

రామవరం మాతా శిశు ఆస్పత్రి పదెకరాల ప్రాంగణంలో విస్తరించి ఉంది. ప్రస్తుతం జీ ప్లస్ వన్‌గా ఈ భవనం ఉన్నప్పటికీ దీనికి జీ ప్లస్ 3 వరకు నిర్మాణ అనుమతులు ఉన్నాయి. కానీ సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే వైద్యులు, బ్లడ్ బ్యాంక్, అనస్తీషియా వంటి కీలక విభాగాలన్నీ సర్వజన ఆస్పత్రిలోనే ఉన్నాయి. దీంతో రామవరం మాతాశిశు ఆస్పత్రితో సీసీయూ యూనిట్ స్థాపిస్తే అత్యవసర సేవలు అందించడం క్లిష్టంగా మారుతుంది. ఈ క్రమంలో సీసీయూ కోసం రామవరం ఆస్పత్రిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. చివరి ప్రత్యామ్నాయంగా సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న సిబ్బంది క్వార్టర్లను తొలగిస్తే కొంత స్థలం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఇక్కడ కూడా 55 మీటర్ల వెడల్పు, 55 మీటర్ల పొడవుతో కూడిన స్థలం అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. పొడవు, అడ్డంలో 50 మీటర్ల స్థలంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

ట్రామా కూడా వస్తే..

మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రుల్లో ట్రామా కేర్ యూనిట్ స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉంది. దీంతో రాబోయే రోజుల్లో కొత్తగూడెం ఆస్పత్రికి ట్రామ్ కేర్ యూనిట్ కింద 100 పడకలు మంజూరయ్యే అవకాశం ఉంది. అంతేకాదు.. బోధనాస్పత్రి అయినందున కచ్చితంగా రాబోయే రోజుల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ప్రస్తుతం యూరాలజీ, గ్యాస్ట్రో విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో పీడియాట్రిక్, వాస్క్యులర్, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో సర్జరీ, న్యూరో, కార్డియో విభాగాలను అందుబాటులోకి తేవాలి. ఈ విభాగాలకు అనుగుణంగా ఎంఆర్ఐ స్కానింగ్, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లు, ఓపీలు కూడా రావాల్సి ఉంటుంది. వీటన్నింటినీ ప్రస్తుతం ఉన్న సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోనే ఏర్పాటు చేయడం సాధ్యమయ్యే పని కాదు.

సమష్టి కృషితోనే సాధ్యం..

భద్రాద్రి జిల్లా దాదాపు ఏజెన్సీ ప్రాంతంతోనే నిండి ఉంది. ఇక్కడి వారితో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు చెందిన వారు కూడా వైద్య సేవల కోసం ఈ జిల్లాపైనే ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా బోధనాస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. త్వరలో వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉన్నందున ఈలోపే సర్వజన ఆస్పత్రి స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు ప్రణాళిక రూపొందించాలని పలువురు కోరుతున్నారు.

ఓటు వేయడం కనీస బాధ్యత



5 కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

- కలెక్టర్ ప్రియాంక ఆల
- కొత్తగూడెంలో ఉత్సాహంగా 5కే రన్

కొత్తగూడెంటౌన్: ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ ఓటు వేయడం కనీస బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి లక్ష్మీదేవిపల్లి మండలంలో గల సెంట్రల్‌పార్క్ వరకు నిర్వహించిన 5 కే రన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటు హక్కు పొందేలా కళాశాల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఫాం 6 ద్వారా నూతన ఓటరుగా నమోదు, ఫాం 8 ద్వారా చిరునామా, పోలింగ్ కేంద్రాల్లో మార్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో ఓటింగ్ శాతం తగ్గిన ప్రాంతాల్లో ఓటు ప్రాధాన్యత వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. ఓటు వేయడం అందరి బాధ్యత అన్నారు. ఓటు ప్రాధాన్యతను వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం 5 కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా, ఆడిట్ అధికారి వెంకట్‌రెడ్డి, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, సహకార అధికారి వెంకటేశ్వర్లు, ఎల్పీఎం రాంరెడ్డి, ఇంటర్మీడియెట్ అధికారి సులోచనారాణి, క్రీడల అధికారి పి.పరంధామరెడ్డి, సీపీఓ శ్రీనివాసరావు, తూనికలు, కొలతల అధికారి మనోహర్, మైనింగ్ అధికారి జైసింగ్, జిల్లా సంక్షేమశాఖ అధికారి ఎం. సబిత, ఆర్డీఓ శిరీష, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, మురళి, రమేష్ పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ వినీత్ తదితరులు

రెండు రోజులపాటు వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, పొలంలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- మైనార్టీలకు ఆర్థిక సాయం పంపిణీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విప్ రేగా కాంతారావు అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లింలకు అందించే రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను కొత్తగూడెం ఉర్దూఘర్‌లో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. రంజాన్ పండుగకు కానుకలు, ఇమాంలు, మౌజన్‌లకు గౌరవ వేతనం, మసీదుల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నూరుశాతం సబ్సిడీతో అందించే ఈ సాయం నిరంతరం కొనసాగుతుందని, తమకు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని అన్నారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 120 మందికి అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ముస్లింలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు మైనార్టీలకు కూడా పూర్తి సబ్సిడీతో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ విడతల వారీగా అర్హులైన వారికి ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. మొదటి విడతలో 140 మందికి లక్ష చొప్పున రూ.1.40 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 15 రోజుల్లో నియోజకవర్గానికి 120 మందికి ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. యూనిట్ల ఏర్పాటుకు అవగాహన కోసం జిల్లా మైనార్టీ అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, ఉర్దూ ఘర్ చైర్మన్ అన్వర్‌పాషా, ఆర్డీఓ శిరీష, తహసీల్దార్ పుల్లయ్య పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న విప్ రేగా, ఎమ్మెల్యే, కలెక్టర్

మూడు రోజుల్లో విచారణ పూర్తి కావాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆసరా పెన్షన్ల దరఖాస్తుల విచారణ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తిచేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. ఐడీఓసీనుంచి శనివారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకానికి 86,773 దరఖాస్తులు వచ్చాయని, శుక్రవారం నాటికి 62 వేల దరఖాస్తుల విచారణ పూర్తయిందని తెలిపారు. మిగిలినవి త్వరంగా పూర్తిచేసి ధ్రువీకరణ నివేదికలు అందజేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు నమోదు చేసి, పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ మండలాల్లో సోషల్ వెల్ఫేర్ ఇంటి పట్టాల విచారణ పెండింగ్‌లో ఉందని, 22వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పోడుపట్టాలు పొందిన వారికి రైతుబంధు నిధుల మంజూరుకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఎంపీడీఓలకు సూచించారు, టెలీ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్ పాల్గొన్నారు.

గిరిజన యువత ఆర్థికాభివృద్ధే లక్ష్యం

దమ్మపేట: గిరిజన యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ట్రైకార్ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్ అన్నారు. శనివారం ఆయన దమ్మపేటలోని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) కార్యాలయం, పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానికంగా లభించే సహజ వనరులతో ఆహార పదార్థాలు తదితర ఉత్పత్తులను తయారుచేసే విధానంపై యువతకు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులు, పదార్థాలను జీసీసీ ద్వారా మార్కెటింగ్ చేయిస్తామన్నారు. గిరిజన ఉత్పత్తి సంస్థలను నెలకొల్పేందుకు ట్రైకార్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీసీసీ మార్కెటింగ్ మేనేజర్ సతీష్, మేనేజర్ నర్సింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్

క్లుప్తంగా

ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్/బూర్గంపాడు/మణుగూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం, బూర్గంపాడు మండలం కృష్ణాసాగర్, మణుగూరుల్లోని ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు ఏ.శ్రీనివాసరావు, లక్ష్మణ్, బి.ప్రభాకర్ తెలిపారు. కళాశాలల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్ (కోపా), ఐఓటీ, స్మార్ట్ అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎన్ని కోర్సులనైనా ఆప్షన్ ఇవ్వొచ్చని తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం సమీప కళాశాలను ఆప్షన్‌గా ఎంచుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం http/iti.telangana. gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రేపు బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఖమ్మంలో జరగనుంది. మామిళ్లగూడెంలోని ఉషాహరి కన్వెన్షన్‌లో జరిగే ఈ సమ్మేళనం కరపత్రాలను శనివారం సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. రెండు జిల్లాలకు చెందిన బ్రాహ్మణ కుటుంబాలు పెద్ద సంఖ్యలో సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కేవీ మురళీకృష్ణమాచార్యులు, తాటికొండల సీతారామశాస్త్రి, వేదాంతం రాఘవాచార్యులు, ఊటుకూరు రవికాంత్, సురావజ్జుల వాసుశర్మ, జమలాపురం కేశవరావు, ఆమంచి సురేశ్‌శర్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



భావన

ములకలపల్లి : సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని ఎస్.భావన అథ్లెటిక్స్ అసోసియేట్ మీట్ అండర్–18 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న భావన, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్వంచ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. రెండు రోజుల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొననుంది.

కిన్నెరసాని నుంచి నీటి విడుదల

పాల్వంచరూరల్: అక్కడక్కడా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి కిన్నెరసాని జలాశయంలో చేరుతోంది. దీంతో 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నీటిమట్టం శనివారం 403.20 అడుగులకు పెరిగింది. ఎగువ నుంచి 1500 క్యూసెక్కుల వరద వస్తుండగా, ప్రాజెక్టుకు చెందిన ఒక గేటు ఎత్తి ఉంచి 3 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు.

టేకు దిమ్మెలు స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను శనివారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఇన్‌ఛార్జి ఫారెస్ట్ రేంజర్ కరుణాకర చారి కథనం ప్రకారం... మండలంలోని నారంవారిగూడెం నుంచి ఓ వ్యాన్‌లో టేకు దిమ్మెలు తరలించి పాత అల్లిగూడెం సమీపంలోని ఓ పొలం దగ్గర నిల్వ ఉంచగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కలపను అక్రమంగా రవాణా చేసిన వాహనం తప్పించుకోగా, పట్టుబడిన టేకు దిమ్మెలను రేంజర్ ఆఫీసుకు తరలించి సీజ్ చేశారు. కలప విలువ సుమారు రూ.75వేలు ఉంటుందని ఫారెస్ట్ రేంజర్ తెలిపారు.

మతిస్థిమితంలేని యువకుడి అదృశ్యం



ఆదిత్య(ఫైల్)

బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక మేజర్ గ్రామపంచాయతీ పాత సారపాకకు చెందిన కందుకూరి ఆదిత్య గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని తండ్రి కందుకూరి నాగేశ్వరరావు శనివారం వివరాలు వెల్లడించారు. ఆదిత్య మతి స్థిమితం కోల్పోయాడని, వయసు 27 సంవత్సరాలు ఉంటుందని, గులాబీరంగు టీ షర్ట్, బ్లూకలర్ జీన్స్ ప్యాంటు వేసుకున్నాడని తెలిపాడు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారని పేర్కొన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 81848 24873, 88974 82580 నంబర్లకు తెలిపాలని కోరాడు.

వ్యాన్ బోల్తా

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం సమీపంలో శనివారం ప్రమాదవశాత్తు వ్యాన్ బోల్తా పడింది. వరంగల్ జిల్లా నర్సంపేట నుంచి సర్ఫ్ ప్యాకెట్లు, సబ్బుల లోడ్‌తో కొత్తగూడెం వైపు వెళ్తున్న వ్యాన్ బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో డ్రైవర్ సాంబయ్య స్వల్ప గాయాలయ్యాయి.

మింగేస్తున్న మాల్స్..

పోటీ తట్టుకోలేక దుకాణాల మూత

- ఉపాధి కోల్పోయి గుమస్తాలుగా మారుతున్న వ్యాపారులు
- మూడేళ్లలో కొత్తగూడెంలో 50 బట్టల షాపులు మూసివేత
- మరోవైపు వేగంగా విస్తరిస్తున్న కార్పొరేట్ మాల్స్
- ఆందోళనకు సిద్ధమవుతున్న స్థానిక వ్యాపారులు



కొత్తగూడెంలో ఇటీవల సమావేశమైన వ్యాపారులు

కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుతం మార్కెట్‌లో విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న మాల్స్ దశాబ్దాలుగా కొనసాగుతున్న దుకాణాలను మింగేస్తున్నాయి. వాటితో పోటీ పడలేక వ్యాపారులు షాపులు మూసివేసి గుమస్తాలుగా పనిచేస్తున్నారు. వస్త్రాలు, ఎలక్ట్రికల్, బంగారం, కిరాణా, మొబైల్స్, కూరగాయలు, పండ్లు ఇలా ప్రతిది కూడా కొత్త కొత్త హంగులు, ఆర్భాటాలతో ఏర్పాటు చేసిన మాల్స్‌లో విక్రయిస్తున్నారు. ఆకర్షణీయత పెంచుతూ, అందుకయ్యే ఖర్చు సహా వినియోగదారులపై భారం మోపుతూ అధిక ధరలకు అమ్ముతున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో మధ్యతరగతి వ్యాపారులు ఉపాధి కోల్పోతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు చేపట్టిన ఉద్యమంతో మాల్స్ ఏర్పాటును నిలిపివేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అదే తరహాలో ఉద్యమం చేపట్టేందుకు ఇక్కడి వ్యాపారులు కూడా సిద్ధమవుతున్నారు. సమావేశాలు నిర్వహించుకుని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేప్రయత్నం చేస్తున్నారు.

80 నుంచి 30కి..

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మూడేళ్ల క్రితం వరకు 80 వస్త్ర దుకాణాలు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 30కి పడిపోయింది. 50 దుకాణాల యజమానులు, అందులో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడినట్లయింది. ఇంకా కొన్ని దుకాణాలు మూసి వేసే పరిస్థితి నెలకొంది. పెద్ద పెద్ద మాల్స్, ఆన్‌లైన్ షాపింగ్, కార్పొరేట్ సంస్థల వల్లే ఈ పరిస్థితి నెలకొంటోందని వ్యాపారులు వాపోతున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట పట్టణాల్లో మూడేళ్లుగా కార్పొరేట్ సంస్థల షాపింగ్ మాల్స్ ఏర్పాటవుతున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ వల్ల ఇంటింటికీ తిరిగే వ్యాపారులకు గిరాకీ పూర్తిగా తగ్గింది. మాల్స్‌తో దుకాణాలు మూతపడుతున్నాయి. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

సోషల్ మీడియా వేదికగా ప్రచారం

కార్పొరేట్ సంస్థల మాల్స్ రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ సోషల్ మీడియా వేదికగా వ్యాపారులు పోస్టులు పెడుతున్నారు. ఇప్పటికైనా మేల్కోనకపోతే రానున్న 4, 5 సంవత్సరాల్లో అన్ని షాపులు మూసివేసే పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. మాల్స్‌లో లభించే వస్తువుల కంటే తాము విక్రయించేవే నాణ్యమైనవని పేర్కొంటున్నారు. తొలినాళ్లలో ఆఫర్లతో ఆకర్షిస్తారని, వినియోగదారులు అలవాటుపడ్డాక ధరలు అమాంతం పెంచేస్తారని అంటున్నారు. మాన్యుఫ్యాక్చరింగ్, డిస్ట్రిబ్యూటర్స్, హోల్‌సేల్ రిటైల్ రంగాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. తయారీదారుడి నుంచి వినియోగదారుడి వరకు నష్టం జరుగుతోంది. దీంతో వ్యాపారులు ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. 2 లక్షల లోపు జనాభా ఉన్న పట్టణాలు, మండలాల్లో కార్పొరేట్ సంస్థలకు లైసెన్స్‌లు ఇవ్వకూడదని, ఇప్పటికే వ్యాపారాలు ఉంటే.. ఆయా రంగాల్లో కొత్త వాటికి లైసెన్స్‌లు ఇవ్వకూడదని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యమిస్తాం



కార్పొరేట్ సంస్థలు, మాల్స్ వల్ల జరుగుతున్న నష్టంపై ఐక్యంగా ఉద్యమిస్తాం. ప్రభుత్వం స్పందించేవరకు ఆందోళన చేపడతాం. స్థానిక వ్యాపారాలు పెరిగేలా కస్టమర్లకు అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తాం. మూడేళ్ల కాలంలో జిల్లా కేంద్రం కొత్తగూడెంలో 50 వస్త్ర దుకాణాలు మూతబడ్డాయి.

–మొరిశెట్టి భవానీప్రసాద్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ

వ్యాపారులకు నష్టమే..



ప్రస్తుతం అన్ని చోట్ల కార్పొరేట్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల పట్టణం అభివృద్ధి జరిగినా.. స్థానిక వ్యాపారులకు నష్టం జరుగుతోంది. క్వాలిటీ, ధరలు గమనించకుంటే వినియోగదారులు కూడా నష్టపోయే అవకాశం ఉంది. ధర, నాణ్యత పోల్చుకుని స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించాలి.

–రాజేష్ ఖన్నా, సామాజికవేత్త

కలుపు మందుతో పంట నష్టం

పత్తి మొక్కలు వాడిపోతున్నాయని రైతుల ఆవేదన



వివరాలు వెల్లడిస్తున్న రైతులు

గుండాల: పత్తి చేనులో కలుపు మందు పిచికారీ చేస్తే చేనంతా పాడైంది. దీంతో రైతులు లబోదిమంటున్నారు. ఆళ్లపల్లి మండలంలోని రామానుజగూడెం గ్రామానికి చెందిన పూనెం పగిడిద్దరాజు 3 ఎకరాలు, మోకాళ్ల శేఖర్ 2 ఎకరాలు, గొగ్గెల క్రిష్ణ 3 ఎకరాలు, పూనెం బుచ్చయ్య, జోగ బుచ్చయ్య పూనెం రాజు, కొటెం బాలరాజు రెండెకరాల చొప్పున 14 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. గత నెలలో ఓ వ్యాపారి వద్ద పత్తి విత్తనాలు కొనుగోలు చేసి నాటారు. ఇరవై రోజులు కావడంతో ఆయా చేనులో కలుపు పెరిగింది. దీంతో అదే వ్యాపారి వద్ద కలుపు మందు కొని 10 రోజుల క్రితం పిచికారీ చేశారు. రెండు రోజుల క్రితం చేనుకు వెళ్లి చూస్తే అంతా వాడిపోయి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకులు కూడా రాలిపోతున్నాయని, చేను ముడుత పడుతుందని వాపోతున్నారు. అధికారులు పంటలను పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు



ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో నిర్వాహకులు

పాల్వంచ: మహనీయుల చరిత్రను వివరించడమే కాక సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని పాల్వంచ మున్సిపల్ కమిషనర్ ఏ.స్వామి సూచించారు. పాల్వంచలోని అంబేద్కర్ సెంటర్‌లో పాల్వంచ కళా పరిషత్ ఆధ్వర్యాన శనివారం జిల్లా స్థాయి డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కమిషనర్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించాలన్నారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందించారు. పాల్వంచ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు బిక్కసాని సుధాకర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంతిపురి రాజుగౌడ్, వేముల కొండలరావుతో పాటు నామా బుచ్చయ్య, వెంకటేశ్వరరావు, రాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం దక్కేనా?



ఎక్సైజ్ అధికారులకు దరఖాస్తు అందజేస్తున్న రవి

కొత్తగూడెంఅర్బన్: ఏజెన్సీలో ఎస్టీలకు మద్యం దుకాణాన్ని కేటాయించాలని కోరుతూ మణుగూరుకు చెందిన కర్నె రవి హైకోర్టును ఆశ్రయించాడు. రవి పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తు స్వీకరించాలంటూ కోర్టు జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రవి దరఖాస్తును శుక్రవారం ఎక్సైజ్ అధికారులు స్వీకరించారు. అయితే మద్యం దుకాణం కేటాయింపు కోర్టు తుది తీర్పుపై ఆధారపడి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా, ఈనెల 21న నిర్వహించే డ్రా కార్యక్రమంలో రవి లక్కు ఎలా ఉంటుందో వేచి చూడాలి.

గుండెకు గండం

- ఖమ్మం పెద్దాస్పత్రిలో నిలిచిన శస్త్రచికిత్సలు
- ఇంజక్షన్లు లేక వారం రోజులుగా ఆపరేషన్లు బంద్
- ప్రాణభయంతో అల్లాడిపోతున్న బాధితులు



ఖమ్మం వైద్యవిభాగం: గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి భరోసా కల్పించేలా ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏడాదిన్నరగా మెరుగైన సేవలు అందుతుండడంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తీరాయి. అయితే, వారం రోజులుగా మాత్రం ఇక్కడ చికిత్సకు అంతరాయం ఏర్పడింది. శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో బాధితులు బెడ్ల మీదే ఉంటూ దీనంగా ఎదురుచూస్తున్నారు. త్వరగా తమకు శస్త్రచికిత్స నిర్వహించాలని వేడుకుంటున్నారు.


అత్యాధునిక యంత్రాలు

ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొన్నేళ్లుగా ఖమ్మం జిల్లాలో గుండె జబ్బులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అయితే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక ప్రైవేట్ దవాఖానాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోయేవారు. మరికొందరు నిరుపేదలు వైద్యం చేయించుకునే స్తోమత లేక తనువు చాలించేవారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రెండేళ్ల క్రితం గుండె సంబంధిత బాధితుల కోసం కార్డియాలజీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. శస్త్రచికిత్సలు నిర్వహించడానికి రూ.7 కోట్ల విలువైన క్యాథ ల్యాబ్ మిషన్‌ను కేటాయించగా, గత ఏడాది జనవరిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. తద్వారా ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స ఉచితంగా అందుబాటులోకి రాగా, వందలాది మందికి శస్త్రచికిత్స చేశారు. కార్డియాలజీ విభాగంలో కరోనరీ యాంజియోగ్రామ్ శస్త్రచికిత్సతో పాటు, స్టంట్లు, బెలూన్ యాంజియోప్లాస్టీ, రెనల్ యాంజియోగ్రామ్, రూట్ యాంజియోగ్రామ్, కారోటిడ్ యాంజియోగ్రామ్, పెరిఫెరల్ యాంజియోగ్రామ్, బ్రాంకియల్ యాంజియోగ్రామ్, పెరీ కార్డియో సెంటెసిస్ తదితర సేవలు అందిస్తున్నారు.

బిల్లులు పేరుకుపోవడంతో...

క్యాథల్యాబ్ యంత్రం ద్వారా చికిత్స చేయాలంటే కాంట్రాస్ట్ ఇంజక్షన్లు అవసరమవుతాయి. బాధితులకు శస్త్రచికిత్స చేసే ముందు ఈ ఇంజక్షన్ ఇచ్చి గుండె పనితీరు, ఎక్కడ ఏ సమస్య ఉంది, స్టంట్ ఎక్కడ వేయాలనే అంశాన్ని మానిటర్ ద్వారా తెలుసుకుంటారు. అనంతరమే శస్త్రచికిత్స చేయడానికి సిద్ధమవుతారు. కానీ కాంట్రాస్ట్ ఇంజక్షన్లు లేకపోవడంతో వారం రోజులుగా శస్త్రచికిత్సలు పూర్తిగా నిలిచిపోయాయి. హైదరాబాద్ గాంధీ, నిమ్స్ తదితర ఆస్పత్రుల మాదిరిగానే ఈ ఇంజక్షన్లు ఇండెంట్ పెట్టి బయట నుంచి తెప్పిస్తారు. అయితే, సరఫరా చేసే ఏజెన్సీకి బిల్లులు పేరుకుపోవడం వారు సప్లై నిలిపివేశారని తెలుస్తోంది. కారణాలు ఏమైనా శస్త్రచికిత్సలు నిలిచి గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఇక్కట్లు ఎదుర్కొంటుండగా... కొందరు చేసేదేం లేక బయటి ఆస్పత్రులకు వెళ్తున్నారు. మరికొందరు మాత్రం శస్త్రచికిత్స ఎప్పుడు చేస్తారా అని వేయి కళ్లతో ఎదురుచూస్తూ గడుపుతున్నారు.

ఇంజక్షన్ వస్తేనే..



ఈయన పేరు సీహెచ్.నాగేశ్వరరావు. వయస్సు 38 ఏళ్లు మాత్రమే. ఐదు రోజుల క్రితం గుండె భాగంలో నొప్పి రావటంతో కూలబడగా ఆయన భార్య ప్రభుత్వ ఆస్పత్రి కార్డియాలజీ విభాగానికి తీసుకొచ్చింది. వైద్యులు పరీక్షించి గుండె సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. కానీ సమస్య తీవ్రత తెలియాలన్నా, శస్త్రచికిత్స చేయాలన్నా కాంట్రాస్ట్ ఇంజక్షన్ అవసరం. అవి లేకపోవడంతో యాంజియోగ్రామ్ నిర్వహించకపోగా ఏమవుతుందోనన్న బెంగతో నాగేశ్వరరావు, ఆయన కుటుంబం ఎదురుచూస్తోంది.

ప్రాణగండమంటూ భయపెట్టారు..

యంత్రాలు ఇచ్చి రూ.26,500 కాజేశారు

అన్నపురెడ్డిపల్లి: ప్రాణగండం ఉందంటూ అపరిచితులు యంత్రాలు ఇచ్చి నగదు కాజేసిన సంఘటన మండలంలోని అబ్బుగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. పూజారి వేషంలో ఉన్న ఇద్దరు అపరిచిత వ్యక్తులు అబ్బుగూడెం గ్రామానికి చెందిన తుంబూరు వెంకటరెడ్డి ఇంటికి వచ్చారు. ఇంట్లో ఒకరికి ప్రాణగండం ఉందని వెంకటరెడ్డి, అతని భార్య చేతిలో పసుపు నీళ్లు పోశారు. అనంతరం హైదరాబాద్‌లో ఉంటున్న వారి కుమారుడు అన్వేష్ రెడ్డి పేరు చెబుతూ వెంకటరెడ్డి చేతిలో పసుపు నీళ్లు పోయగా, ఎరుపు రంగులోకి మారాయి. దీంతో మీ కుమారుడు చనిపోతాడని, రూ.30 వేలతో పూజ చేస్తే ప్రాణగండం తప్పుతుందని నమ్మబలికారు. భయపడిన వెంకటరెడ్డి తన కూతురు ఫోన్ నుంచి అపరిచిత వ్యక్తులు చెప్పిన ఫోన్ నంబర్‌కు రూ.26,500 ఫోన్ పే చేయించాడు. అనంతరం రెండు యంత్రాలు ఇచ్చి, ఇంటి గుమ్మానికి కట్టమని చెప్పి వెళ్లిపోయారు. ఆ తర్వాత అనుమానం వచ్చిన వెంకటరెడ్డి ఇంటి పక్కన ఉన్న ప్రసాద్ అనే వ్యక్తి విషయం చెప్పగా, ఆయన పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై షాహీన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్‌లో లోటుపాట్లు ఉండొద్దు



రంగులు వేసిన గదులను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ: షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహం నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి.అనసూర్య సూచించారు. శనివారం బీసీఎం రోడ్‌లోని హాస్టల్‌ను సందర్శించిన ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.నర్సింహారావును ఆదేశించారు. కాగా, ఈ నెల 16న కలెక్టర్ ప్రియాంక ఆల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గదులకు కనీసం వైట్ వాష్ లేకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. దీంతో అధికారుల్లో చలనం కలిగింది. హాస్టల్‌లోని పది గదులకు వైట్ వాష్, తలుపులు, కిటికీలకు రంగులు వేయించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. పనులు పూర్తి కావడంతో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పరిశీలించి, తగిన సూచనలు చేశారు.

హత్యకేసులో లొంగిపోయిన నిందితుడు



తల్లికి అంతిమ సంస్కారాలు చేస్తున్న కుమార్తె ఉమారాణి

ఇల్లెందురూరల్: తల్లిని చంపిన వ్యక్తి శనివారం ఇల్లెందు పోలీసులకు లొంగిపోయాడు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ మోదుగులగూడేనికి చెందిన మెరుగు పద్మను శుక్రవారం ఆమె కుమారుడు యాకయ్య హతమార్చిన విషయం విదితమే. ఆర్థిక పరమైన అంశాలు, ఇంటి స్థలం విషయంలో తల్లి, కొడుకుల మధ్య ఘర్షణ హత్యకు దారితీసింది. తల్లి మృతి చెందినట్లు నిర్ధారించుకున్న యాకయ్య ఇంటి ముందు దర్వాజ మూసి అక్కడి నుంచి జారుకున్నాడు. రాత్రి వేళలో పద్మ బయటకు రాకపోవడంతో అనుమానించిన స్థానికులు తలుపు తీసి చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు విచారణ నిర్వహించి కుమారుడే హత్య చేసినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు. క్షణికావేశంలో రోకలి బండతో మోది తల్లిని హత్యచేసినట్లు పోలీసుల ఎదుట నిందితుడు అంగీకరించాడు. పద్మ మృతదేహానికి శనివారం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. చిన్నకుమారుడు గతంలోనే ఆత్మహత్య చేసుకోవడం, పెద్ద కుమారుడు పోలీసులకు లొంగిపోవడంతో కూతురు ఉమారాణి తల్లికి తలకొరివి పెట్టింది. పద్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.